
# నేను మగాణ్ణి

## గంగ



ఈవేళ మీకో చిన్ని కల గురించి చెబుతాను.

అది ఇవ్వాళే మధ్యాహ్నం ఒంటిగంట-మూడున్నర గంటల మధ్య వచ్చింది. ఇవాళ ఆగస్టు 6, 1984.

ప్రస్తుతం నేను మీకు విపులంగా చెప్పాలనుకుంటున్నది, మీరు విపులంగా ఆలోచించవలసింది నా కలలోని ఉత్తరార్థ భాగం గురించే. మీ కర్థమయ్యే విధంగా వుండేందుకు నా కలలోని పూర్వార్థభాగం గురించి కూడా కొంత క్లుప్తంగా చెబుతాను.

ఆ కలలో మాది ఓ చిన్న పల్లెటూరు. కల పూర్వార్థ భాగంలో నేను, నా మిత్రులు పడరాని పాట్లు పడి ఓ పెద్ద పామును చంపి చేతులు కడుక్కోవడానికై బయలుదేరాము. మాటల్లో పడి నా మిత్రులు కొద్దిగా వెనుకబడ్డారు.

ఇక ఉత్తరార్థ భాగం మొదలవుతోంది. శ్రద్ధగా వినండి.

చేతులు కడుక్కోవడానికని బయలుదేరామని చెప్పా కదూ. అక్కడ నీళ్ళున్న చోటికి ప్రక్కనే ఆడవాళ్ళు కూర్చునే చోటుంది. నేను మామూలుగానే నీళ్ళున్న చోటుకు వెళ్లాను. నీళ్ళ కోసం నేను వంగేసరికి ఆ అమ్మాయి కొద్దిగా అడ్డం వచ్చింది. పైకి లేచి చూసేసరికి ఆ అమ్మాయి నా వంకే చూస్తోంది. చుట్టూ చూశాను. అందరూ మాయమయ్యారు. కల కదూ-అందరూ ఎలా వస్తారో తెలియదు. ఎలా పోతారో తెలియదు. సరే వారి గురించి వదిలేయండి. ఆ అమ్మాయి గురించి చెబుతున్నా.

ఎందుకో నాకా సమయంలో ఆమెను చూస్తే ఇబ్బంది వేయలేదు. మరే భావన రాలేదు కూడా. ఆమె నాకు పరిచయస్తురాలు కూడా కాదు. అయినా మర్యాద కోసం చిరునవ్వు మొహం పెట్టేను. ఆ అమ్మాయి నవ్వింది. నీళ్ళ తొట్టెపై నుండి (సారీ. ఇప్పుడా అమ్మాయి దానిమీదే కూర్చుని వుంది.) కొద్దిగా ప్రక్కకి జరిగింది.

తొట్టె ప్రక్కనే చిన్న పెట్టెలో సబ్బు బిళ్ళ వుంది. నేను నీళ్ళందుకుని చేతులపై పోసుకుని, సబ్బుతో చేతులు రుద్దుకోబోయాను. ఆ అమ్మాయి నా చేతులు అందుకుంది. ఓ చేయిని ఒడిలో పెట్టుకుని మరో చేతిని సబ్బుతో సున్నితంగా రుద్దుతోంది. మెల్లిగా ఆమె ఒడిలోని చేయిని లాక్కున్నాను. నాకద ఇబ్బందిగా వున్నా అసహజంగా అనిపించలేదు. అలా నా మెదడు ఆలోచించలేదు కూడా.

ఆమె అలా నా చేయికి సబ్బు రుద్దడం నాకు చాలా హాయిగా వుంది. అయినా లాక్కోబోయాను. ఆమె కాస్త గట్టిగా పట్టుకుని నన్ను చూస్తూ నవ్వింది. చాలా సహజంగా మాట్లాడుతోందామె. మేమున్న స్థలి రోడ్డు కూడలిగా మారింది. చీకటి రాత్రి. మేమిద్దరం ఒకరివంక ఒకరం చూసుకునే వెలుగు తప్ప అంతా చీకటే. దారంట అప్పుడప్పుడు ఎవరో వెళుతున్నారు. మమ్మల్ని వాళ్ళు గుర్తించినట్టు లేదు. లేక పట్టించుకోలేదో!

నే మొహం కడుక్కుంటున్నాను. ఆ అమ్మాయి నాకింకా దగ్గరగా వచ్చింది. అప్పుడా వెలుగులో ఆమెను స్పష్టంగా చూశాను. ఎక్కడో చూసినట్లనిపించింది. ఊహూ. తెలియలేదు. "మీ పేరు" అని అడిగాను. "...మాల" అని చెప్పింది. (కల కదూ. స్పష్టంగా గుర్తుకు రావడం లేదు. ఇక నుంచీ ఆమెను మాల అనే అంటాను) నా మెదడు నా కళ్ళ నామెకు పరీక్షా వేదికలుగా మార్చింది. పరీక్షగా చూశానామెను. నల్లగా, బొగ్గులా కాకపోయినా నలుపు మనిషి. కాని దానిని చామనఛాయకు తెచ్చే ప్రయత్నంలో వున్నట్టు తెలుస్తోంది. అంటే చాలా శుభ్రంగా వుందన్నమాట. ఓణీ వేసుకుంది. అది కూడా చాలా శుభ్రంగా వుంది. రంగు ఆకుపచ్చ అనుకుంటా. జాకెట్ తెలుపు కావచ్చు. కానీ చీకటి కాంతి కదూ-కొద్దిగా ఖద్దరు రంగులో కనబడుతోంది. పళ్ళు తెల్లగా కాకపోయినా శుభ్రంగా, కాంతివంతంగా వున్నాయి. మొహం ఆకర్షణీయంగా వుంది. మిగతా శరీరమంతా కూడా ఆరోగ్యంగా, నిండుగా వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆమె కన్నె బంగారులా వుంది.

ఆమె ఇంకా నా దగ్గరికి వచ్చింది. ఆమె ముఖానికి నా ముఖం రాచుకుంది. ఆమె ముక్కుపై కొద్దిగా సబ్బు నురగ అంటింది. సున్నితంగా తుడిచి వేశాను. ఆమె నాలోని స్పర్శాకాంక్షను అద్వితీయంగా సంతృప్తి పరుస్తోంది. కాని నన్నామె రెచ్చగొట్టలేదు. నే నామెకు లొంగిపోలేదు కూడా. నా మెదడింకా తీక్షణంగా కాకపోయినా స్పష్టంగా ఆలోచిస్తూనే వుంది. అయితే అది ఆ అమ్మాయి గురించి కాని, ప్రస్తుతం నేనున్న పరిస్థితిని గురించి కాని కాదు.

బహుశా మే మలా ఇంకాసేపు వుంటే కామ క్రీడల్లోకి దిగేవారమేమో. కాని కల కదూ. నేను మొహం కడుక్కోవడం అయిపోయింది. ఆమె తన పైట

చివరతో నా మొహాన్ని తుడచింది. ఆమె పైట జారలేదు సుమండీ. మళ్ళీ ఆమెను తాకాను. గాఢంగా ఆమె చెంపపై ముద్దు పెట్టుకోబోయాను కూడా. అంతలో సైకిల్‌పై ఎవరో వచ్చారు.

"ఇది నీ దగ్గరకు వచ్చిందా"–సైకిల్ దిగకుండానే కాలు క్రింద పెట్టి తీవ్రంగా ప్రశ్నించాడతను. కానీ ఆ తీవ్రతలో కోపం లేదు. నేను ఆశ్చర్యంగా ప్రక్కకి జరిగాను. కొద్దిగా తెల్లగా వున్నా డతను. గడ్డంచేసి అయిదారురోజులయిందేమో. కానీ శుభ్రంగానే వుంది.

"ఈమె నీకు తెలుసా?" అడిగానతన్ని. అతన్ని ఎక్కడా చూసిన గుర్తులేదు.

"ఆ! మా అక్క" సమాధానమిచ్చాడు అతను.

"ఏమిటీ? నీ అక్కనా. చెల్లెల్ని కాదూ"–తీవ్రంగా ప్రశ్నించిందామె. ఆమె తీవ్రతలో కోపమూ, నిస్సహాయతా వున్నాయి.

ఏదో అనడం ఇష్టం లేనట్టుగా ఆలోచిస్తూ సైకిల్‌పై అలాగే వెళ్ళిపోయాడతను.

ఆమె వంక చూశాన్నేను. ఎందుకో ఇందాకటి భావన కల గలేదు. ఆమె నన్ను అదే నవ్వుతో చూసింది. ఆ నవ్వులో ఏదో బాధని దాచింది.

ఆమె వంక మార్దవంగా చూశాను నేను. అంతలో ఆమె వెనుకనుండి ఎవరో అటుగా వచ్చేరు. మమ్మల్ని చూసి మా దగ్గరగా వచ్చారు.

"ఇది ప్రస్తుతం నీ దగ్గరికి వచ్చిందా?" అసహ్యత లేకున్నా ఆ కంఠంలో నిరసన కనిపించింది.

"ఏం? ఈమె మీకు తెలుసా?"

"నా చెల్లెలు."

కానీ అతనికి నా పట్ల కోపం కాని, ఆమె పట్ల ఆగ్రహం కాని కలుగలేదు. ఆమె నన్ను పాడుచేస్తోందన్న భావన అతని చూపులో కనపడుతోంది. అంతకుమించి ఆమె నన్ను ఉపయోగించుకుంటోందన్న అర్థం అతని మాటల్లో వినబడుతోంది.

"ఛీ. ఛీ. ఈమె ఇలాంటిదని నాకు తెలియదు.

## రెబెకా

ప్రజాపతి ఉరుముతాడు
ఐవీ శంపాలత క్రీపర్ మెరుస్తుంది
ఇసిరిస్ వినాయకుడు చెర్లో మునుగుతాడు
కప్ప తల్లి పెళ్లి అయిపోతుంది
బతకమ్మ పండగ చేసుకుంటాం
నీ ప్రప్రథమ అధమాధమ ప్రేయసి
చాటల్ని పంచుతుంది
కదలని అక[illegible]తా నదిలో
ఆత్మకు లంగరు వేస్తాం
అక్షరం క్షయమవుతుంది
ఆత్మ శరీరమవుతుంది

—'మో'

ఇందాకటి నుంచీ ఎలా వదిలించుకోవాలిరా దేవుడా అని ఆలోచిస్తున్నాను"–అప్రయత్నంగా వెలువడ్డాయి నాలో నుండి మాటలు. గర్వంగా ఆమె వంక చూశాడతను. నా బుద్ధి ఆశ్చర్యపోకపోయినా నన్నే చూస్తూ వుండి పోయింది. బహుశా దానికి నోట మాట రాలేదేమో!

ఆ అమ్మాయి వంక చూశాను నేను. అభిమానం దెబ్బతిన్నట్టుగా మొహం ఎర్రపడింది. కళ్ళలో నీళ్ళ తెరలు. కొద్దిగా తలవంచుకుందామె. మెల్లిగా ఎవరి దారిన వాళ్ళం బయలుదేరాం. నేను మీ దగ్గరికి వచ్చాను.

ఇప్పుడు చెప్పండి. ఉహూ. నేనే చెప్పుకుంటాను. ఆ అమ్మాయిని నే నలా ఎందుకు అన్నాను. ఆమె డబ్బు కోసరమే వచ్చిందా. సరే వచ్చిందనుకుందాం. కానీ ఆ అమ్మాయి దాని ఊసే ఎత్తలేదే. ఆమె నాలోని బలహీనతను రెచ్చగొట్టి పూర్తిగా ఉపయోగించుకో చూసిందా. అది బలహీనతా? ఆమె వాంప్‌లాగా ఏమీ నటించలేదే. సన్నిహితురాలయిన ప్రియురాలిలా సహజంగా ప్రవర్తించింది. ఆమె నన్ను రెచ్చగొట్టిందెక్కడ? నాలో పురుషత్వం ఇంకా స్వచ్ఛంగా, పవిత్రంగానే వుందే. ఆమె నాలోని కామాన్ని రెచ్చగొట్టలేదు. కాని నాలోని స్త్రీ స్పర్శాకాంక్షను అంతవరకూ మాత్రం చల్లార్చింది. నా మనసుకు సంతృప్తిని చేకూర్చింది. అందులో ఆమె స్వార్థం వుందా. వుండవచ్చు కాక. డబ్బు కోసమే ఆమె అలా చేయవచ్చు కాక. కానీ ఆ లోటు రాకుండా మనస్ఫూర్తిగా, నిండు కోరికతో ఆమె నన్ను తాకిందే– ఆమె భ్రష్ట ఎలా అవుతుంది?

నా కంటే ముందామెను ఎవరో తాకి వుండవచ్చన్న భావన కలుగగానే నా నోరలా ఆమెను ఎందుకు హింసించింది? అంతకు ముందు ఆమెను చుంబించిన పెదవులే కాదూ అవి– చుంబన ప్రేమకు చిహ్నం కాదా.

ఎన్నో రాత్రులు నేను కలలు కన్నాను. కొన్ని కొన్ని సార్లు పగటికి, రాత్రికి తేడా తెలియకుండా కన్నాను. నిద్రలో కాదు–నిద్రపోబోయే ముందు. కాని ఏనాడూ ఏ పగటి కలలో కూడా నా ప్రియురాలు నా మనసును ఇలా తీయని ఊహలలో, అనుభూతులలో సంతృప్తిగా ఓలలాడించలేదే. మరి నా మనస్సును కలలోనయినా, ఆ కొద్ది క్షణాలే అయినా తీయని అనుభూతులకు లోను చేసిన ఆమెను నేనలా ఎందుకు కించపరచి మాట్లేడేను. మాట్లాడింది కలలో నయినా అది నాలో దాగున్న కుంచి తత్వానికి ముమ్మాటికీ కాదూ?

ఈ కుంచిత తత్వం ప్రతీ మగాడిలోనూ వుంటుందా? ఉంటే ప్రతీ స్త్రీ ఇలాగే మోసపోతుందా. తాకేప్పుడు నే నామెను మనస్ఫూర్తిగానే తాకాను. కానీ సమాజానికి నేనీ విషయం ఎందుకు చెప్పలేదు. సరికదా సమాజంతో కలసి నేనూ ఆమెపై ఓ రాయి వేసేను. తాకేప్పుడు ఆమెకు, నా ప్రియురాలికి భేదం లేదు. కాని అదే భావన సమాజం ఆమెపై విరుచుకుపడినప్పుడు ఎందుకు కల గలేదు? అదే ఆమె నా భార్య అయివుంటే సమాజం ఆమె నలా అనగలిగేదా? అంటే నేనూ ఆమె నలా నిందించేవాడినా?

మేము చేసింది సమాజం దృష్టిలో తప్పే కావచ్చు. కానీ ఇద్దరం కూడి చేసిన తప్పుకు శిక్ష ఒకరికే ఎందుకు వేయాలి? నే నలా అంత తేలిగ్గా ఎందుకు తప్పించుకున్నాను. సమాజం నన్ను వదిలేసి తన దృష్టినంతా ఆమెపైనే ఎందుకు కేంద్రీకరించింది. దీనికి సమాధానాలు లేవు. ఆమె కులట. నేను మగవాణ్ణి.

నే నామెను నిందిస్తున్నప్పుడు ఆమె నన్ను అసహ్యంగా చూడలేదు. అర్థం చేసుకున్నట్టుగా తలపంకించింది. నిస్సహాయతతో వుబుకుతున్న కన్నీళ్ళను కళ్ళలోనే దాచుకుని బరువుగా నడుస్తూ వెళ్ళిపోయింది. ఎందు వల్ల? ఏమిటి ఆమె నన్ను అర్థం చేసుకుంది.

"నేను మగాణ్ణనా!" ●

(మగాళ్ళందరూ ఇలాంటివారు కాకపోవచ్చు. కానివారికి క్షమాపణలతో)

